

హుస్నాబాద్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌లో ఎన్నికల అధికారులు, సిబ్బందితో సందడి



హుస్నాబాద్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ నుంచి ఈవీఎంలు, పోలింగ్ సామగ్రితో గ్రామాలకు తరలివెళ్తున్న అధికారులు సిబ్బంది



హుస్నాబాద్‌లోని ఈవీఎంల డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను సందర్శిస్తున్న పోలీసు అబ్జర్వర్ సోనమ్ భూటియా

# పోలింగ్‌కు రెడీ

## గ్రామాలకు తరలిన ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది

- హుస్నాబాద్‌లోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్ వద్ద అధికారులు, సిబ్బంది సందడి
- 304పోలింగ్ కేంద్రాలకు పోలీసు బందోబస్తు మధ్య ఈవీఎంల తరలింపు
- విధులు నిర్వహించనున్న 1,400మంది ఎన్నికల అధికారులు, సిబ్బంది
- ఓటు హక్కును వినియోగించుకోనున్న 2,42,177 మంది ఓటర్లు

హుస్నాబాద్, నవంబర్ 29 : హుస్నాబాద్ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం ఈవీఎంలు, ఎన్నికల సిబ్బంది, అధికారులు గ్రామాలకు తరలివెళ్లారు. బుధవారం హుస్నాబాద్‌లోని టీఎస్ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రంలో ఉదయం నుంచి ఈవీఎంలు, పోలింగ్ సామగ్రి పంపిణీ కార్యక్రమం జరిగింది. అధికారులు, సిబ్బంది, పోలీసులతో మోడల్ స్కూల్ ఆవరణ సందడిగా మారింది. మధ్యాహ్నం వరకు పంపిణీ కార్యక్రమం పూర్తి కాగా పీవోలు, ఏపీవో, ఓపీవోలు, పోలీసు సిబ్బంది ఎన్నికల సామగ్రితో వివిధ వాహనాల్లో వారివారికి కేటాయించిన పోలింగ్ బూత్‌లకు చేరుకున్నారు. నియోజకవర్గంలోని 304పోలింగ్ స్టేషన్లు ఉండగా, పోలింగ్ నిర్వహణ కోసం మొత్తం 1,400మంది అధికారులు, సిబ్బందిని నియమించినట్లు ఆర్వో బెన్ షాలోమ్ తెలిపారు. వీరితోపాటు 32మంది రూట్ ఆఫీసర్లు, 138 మంది మైక్రో అబ్జర్వర్లు, 32సెక్టార్లలో విధులు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని 304పోలింగ్ కేంద్రాల పరిధిలో 2,42,177 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. 1,19,757మంది పురుషులు, 1,22,416మంది మహిళలు, ఇతరులు నలుగురు ఉన్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్న ఎన్నికల సిబ్బంది గురువారం ఉదయం నుంచి జరుగనున్న పోలింగ్‌కు ఏర్పాట్లు చేసుకోవడంలో నిమగ్నమయ్యారు. ఆయా పోలింగ్‌కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక పోలీసు నిఘా ఉంచారు. డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ను పోలీసు అబ్జర్వర్ సోనమ్ టెన్సింగ్ భూటియా సందర్శించారు. భద్రతా చర్యలపై స్థానిక ఏసీపీ సతీశ్‌తో చర్చించారు. అన్నిపోలింగ్ కేంద్రాల వద్ద 144సెక్షన్ అమలు ఉంచామని ఏసీపీ తెలిపారు.

## హుస్నాబాద్‌లో పెరిగిన పోలింగ్ కేంద్రాలు

హుస్నాబాద్ టౌన్, నవంబర్ 29 : గత అసెంబ్లీ ఎన్నికలకంటే ఈసారి పోలింగ్ కేంద్రాల సంఖ్యను ఎన్నికల అధికారులు పెంచారు. పట్టణంలో గతంలో 17పోలింగ్ కేంద్రాలు ఉండగా, ఈ ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల సంఖ్యను 18కి పెంచారు. హుస్నాబాద్ మున్సిపల్ పరిధిలో 18,118మంది ఓటర్లు ఉండగా, 8,872మంది పురుషులు, 9244మంది మహిళా ఓటర్లతోపాటు ఇతరులు ఇద్దరు ఉన్నారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో పట్టణంలో 6నుంచి 22 వరకు పోలింగ్ బూత్‌ల సంఖ్య ఉండగా, ఈ ఎన్నికల్లో 23వ పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. ఆరపల్లిలోని మహిళా రీడింగ్ కేంద్రంలో ప్రత్యేకంగా ఈ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పోలింగ్ బూత్‌ల సంఖ్య 18కి చేరింది. గతంలో 9,10,11 పోలింగ్ బూత్‌లను ఆరపల్లి ప్రాథమిక పాఠశాలలో నిర్వహించగా, ఇందులో 9వ పోలింగ్ బూత్‌ను మహిళా రీడింగ్ కేంద్రానికి ఎన్నికల అధికారులు మార్చారు. 11వ పోలింగ్ బూత్‌ను ఆరపల్లి మహిళా రీడింగ్ కేంద్రానికి మార్చాల్సి ఉండగా, 9వ బూత్‌ను అధికారులు మార్చడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

## పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి

బెజ్జంకి, నవంబర్ 29 : మండలంలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్‌కు అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. మండలంలో 42 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండల కేంద్రంలో మోడల్, బేగంపేటలో మహిళా పోలింగ్ కేంద్రాలను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. మండలంలో 42 పీవోలు 378 మంది సిబ్బంది, ఎస్సై నరేందర్ రెడ్డి, సీఐ చేరాలు, 21 మంది పీసీలు, 4 మంది హెడ్‌పీసీలు, 37 మంది ఇతర రాష్ట్రాల పోలీసులు, 24 మంది సెంట్రల్ పోలీస్ సిబ్బంది ఎన్నికల్లో పాల్గొంటున్నారు. మండలంలో 27994 మంది ఓటర్లు ఉండగా, 13,675 పురుషులు, 14,319 మహిళ ఓటర్లు ఉన్నారు. నియోజకవర్గంలో 10 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.



బెజ్జంకిలో పోలింగ్ కేంద్రాన్ని ముస్తాబు చేసిన అధికారులు

## ఉచిత కరెంట్ ఇవ్వడం ఎవరితో సాధ్యం కాదు



కేసీఆర్‌తోనే 24 గంటల ఉచిత కరెంట్ సాధ్యమయితది. కాంగ్రెసోళ్లతో ఉచితంగా 24 గంటల కరెంట్ ఇచ్చుడు సాధ్యం కాదు. మూడు గంటల కరెంట్‌తో పంటలు పండించుకొవచ్చని మాట్లాడుతున్న కాంగ్రెసోల్లు వ్యవసాయం చేసి చూపించాలే. కేసీఆర్ వచ్చునంకనే ఇన్నేండ్లలో రైతులకు ఎలాంటి బాధలు లేవు. మూడు గంటల కరెంట్‌తో రైతులకు బాధలు తప్పవు. 24 గంటల కరెంట్ ఇస్తున్న కేసీఆర్ ప్రభత్వుమే బాగుంది. రైతులకు న్యాయం చేయని వాళ్లు మాకొద్దు. వ్యవసాయం చేసుకునేలా తెలంగాణను బాగా చేస్తున్న కేసీఆర్‌తోనే రైతులుంటారు. గతంలో కరెంట్ ఎప్పుడోస్తాదో తెలియక బోరు మోటర్ల వద్దనే పడిగాపులు కాసి అక్కడే పడుకునే వాళ్లం. దొంగరాత్రి కరెంట్‌తో ప్రమాదాలు జరిగి రైతులు చనిపోతే పైసా రాలేదు. ఇప్పుడు అట్లనే ఉందా..? మంచిగా రోజంతా కరెంట్ కనిపిస్తుంటే పిల్లలే బోరు మోటర్ ఆన్‌చేసి వస్తున్నారు. కరెంట్ కోసం దిగాలుగా బోరుకాడ కూర్చునే రోజులు పోయి సంబురంగా పంటలు పండించుకునే రోజులొచ్చాయి. కాంగ్రెస్ నాయకులు మాట్లాడే మాటలతో రైతులు ఆగమైతుర్రు. రైతులను మోసం చేయాలని చూస్తే భగవంతుడే మాకు పెద్దదిక్కు.

-బడికేలా సురేందర్‌రెడ్డి, రైతు, బయ్యారం, గజ్వేల్ మండలం

## ఎవుసం బంద్ చేసుకోవాలె



ఎన్కట వచ్చిపోయే కరెంట్‌తోటి చాలా తక్లిబ్ అయ్యేది. కరెంట్ ఎప్పుడొస్తదో, ఎప్పుడూ పోతదో తెల్వకపోయేది. యాసంగి వస్తే కరెంట్ కోసం బాయిల కాడనే పండుకునేది. ఇప్పుడా ఇబ్బంది లేదు. 24గంటల కరెంట్ వస్తుంది. అప్పుడు ఎకరం పారిన పొలం 24గంటల కరెంట్‌తో ఐదెకరాల పొలం పారుతుంది. భూమికి బరువైన పంట పండుతుంది. మల్ల కాంగ్రెసోళ్లు మూడు గంటల కరెంట్ అంటుండ్రు. పది హెచ్‌పీ మోటర్లు అంటుండ్రు. మూడు గంటల కరెంట్ ఇస్తే ఎవుసం బంద్ చేసుకోవాలె. 24గంటల కరెంట్ కరెంట్‌తోనే రైతులకు లాభం జరుగతది.

-మానెపల్లి రామచంద్రం, రైతు, ధర్మారం గ్రామం, మద్దూరు మండలం

## ఓటరు చైతన్య చిత్రం ఆవిష్కరణ



సిద్దిపేట టౌన్, నవంబర్ 29 : అసెంబ్లీ ఎన్నికలను పురస్కరించుకుని రుస్తుం ఆర్ట్ గ్యాలరీలో ప్రముఖ అంతర్జాతీయ చిత్రకారుడు రుస్తుం ఓటరు చైతన్య చిత్రాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటు మన భవిష్యత్‌ను నిర్ధేశిస్తున్నదన్నారు. ఎన్నికలు ప్రజాస్వామ్యానికి జీవనాడి.. దేశ సమగ్రతను కాపాడే ఆయుధం అని చెప్పారు. ప్రజల సమస్యలను పరిష్కరించే ఉత్తమ నాయకునే ఎన్నుకోవాలని కోరారు.

ప్రముఖ చిత్రకారుడు రుస్తుం ఆవిష్కరించిన ఓటరు చైతన్య చిత్రం

## తెలంగాణక వొచ్చినంకా కుటుంబంతో కలిసి ఉంటున్నాం



తెలంగాణ రాక ముందు వ్యవసాయం చేద్దామంటే నీళ్లు బోర్లు వేసి అప్పుల పాలు అయిన. గా చేసిన అప్పులు తీర్చడానికి కుటుంబాన్ని వొదిలిపెట్టి దుబాయ్‌కి పోయిన. తెలంగాణ వొచ్చినంకా సీఎం కేసీఆర్ రైతుల కోసం ప్రాజెక్టులు కట్టడంతో పాటు 24గంటల కరెంట్ ఇస్తుండడంతో దుబాయ్ నుంచి వచ్చి వ్యవసాయం చేసుకుంటూ కుటుంబంతో సంతోషంగా ఉంటున్నా.

-తలారి యాదయ్య, రైతు, కిష్టంపేట, కొమురవెల్లి

## కాంగ్రెస్ వస్తే ఎవుసం పడవు పెట్టుడే



నాకు రెండెకరాల వ్యవసాయ పొలం ఉంది. కాంగ్రెస్ వాళ్లు అధికారంలోకి వస్తే మూడు గంటల కరెంట్ ఇస్తామంటున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 24 గంటలు ఉచిత కరెంట్ ఇస్తుంది. మంచిగా పంటలు సాగు చేసుకుంటున్నాం. కాంగ్రెస్ ప్రభుత్వం వస్తే రైతుల నష్టపోతాం. మళ్లా ఎవుసాలు బంద్ పెట్టుకోవాలే. మాకు బీఆర్ఎస్ ప్రభుత్వం కేసీఆర్ సార్ రావాలి.

-ధోతి తిరుపతి, రైతు, మల్యాల, నారాయణరావుపేట మండలం

## ఎయిడ్స్‌పై అవగాహన

హుస్నాబాద్ రూరల్, నవంబర్ 29: ప్రపంచ ఎయిడ్స్ దినాన్ని పురస్కరించుకొని హుస్నాబాద్ ప్రభుత్వ దవాఖాన ఐసీటీసీ ఆధ్వర్యంలో బుధవారం మండలంలోని జిల్లెలగడ్డలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో విద్యార్థులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఐసీటీసీ కౌన్సిలర్ తిరుపతి మాట్లాడుతూ ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. ఎయిడ్స్ రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ వాసుదేవ్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీకాంత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఐసీటీసీ కౌన్సిలర్

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ రామకృష్ణ గ్రూప్ (AP, న్యూఢిల్లీ No.1) శ్రీమంతుల ఇండ్లలో వృద్ధుల/పేషెంట్ల సేవకు ఇంటి/వంట పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు 12/24 గంటల డ్యూటీ కొరకు కావలెను. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. వృద్ధుల/పేషెంట్ల సేవకు వర్కర్లను 24x7 మీ ఇంటికి పంపగలము. 9281452762, 9515108830.
NT-314461

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.